సాక్షి
వనపర్తి
శనివారం । 29 । జూలై । 2023



## ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ

జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద వస్తుండటంతో కృష్ణమ్మ ఉరకలెత్తుతోంది.

వివరాలు 8లో ▸



## ముగిసిన నవోదయ క్రీడలు

వట్టెంలోని నవోదయ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడలు శుక్రవారం ముగిశాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
28.8 /22.1

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచే మునురు కమ్ముకుంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురవొచ్చు.

## న్యూస్‌రీల్

### ‘మేరీ మట్టి.. మేరీ దేశ్’ను విజయవంతం చేస్తాం



వనపర్తి: అమరవీరుల త్యాగాలను స్మరించుకునేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన ‘మేరీ మట్టీ.. మేరీ దేశ్’ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేస్తామని డీఆర్‌డీఓ నర్సింహులు తెలియజేశారు. ఈ విషయమై శుక్రవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి విజయ్ తివారీ వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లా డీఆర్‌డీఓలు, డీపీఓలతో సమీక్ష నిర్వహించారు. అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా అగస్టు 9 నుంచి 30వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహణపై సూచనలు చేశారు. స్వాతంత్య్ర సంగ్రామంలో ఎందరో మహానుబావులు స్వాతంత్య్రం కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసిన చరిత్ర ప్రస్తుత తరానికి తెలియజేసేందుకు భారత ప్రభుత్వం ఈ కార్యక్రమాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు వెల్లడించారు. దేశంలోని అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో ‘మేరీ మట్టీ.. మేరీ దేశ్’ కార్యక్రమం ప్రచార కార్యక్రమాలు చేయాలన్నారు. అమరవీరుల పేర్లతో కూడిన శిలాఫలకాలను ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో పాటు గతేడాది మాదిరిగానే ‘హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 13 నుంచి 15 వరక ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, ప్రతి గ్రామం నుంచి తీసిన మట్టి కళశాలను దేశ రాజధాని ఢిల్లీకి పంపించాలన్నారు.

### పత్తిసాగులో జాగ్రత్తలు అవసరం



అమరచింత: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పత్తిపంటను సాగుచేస్తున్న రైతులు జాగ్రత్తలు పాటిస్తే పంటను కాపాడుకునే వీలుందని ఏడీఏ దామోదర్ తెలియజేశారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో శుక్రవారం పర్యటించిన ఆయన పత్తిపంటలను పరిశీలించారు. ఈ మేరకు పత్తి సాగు చేస్తున్న రైతులను కలిసి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మొక్కలు ఎర్రబడితే మెగ్నీషియం సల్ఫేట్‌ను పిచికారీ చేయాలన్నారు. ఆకుమచ్చ తెగులు సోకితే నివారణ కోసం కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను పిచికారీ చేయాలన్నారు. వర్షాల కారణంగా పిచ్చిమొక్కలు ఎక్కువగా పంట పొలాల్లో పెరిగే అవకాశం ఉందని, వీటిని ఎప్పటికప్పుడు దుక్కి దున్నడం ద్వారా తొలగించుకోవచ్చన్నారు. సకాలంలో వర్షాలు పడుతున్నాయని, రైతులు కందితో పాటు, ఆముదం పంటలను సాగు చేసుకుంటున్నారని వివరించారు. అధిక మొత్తంలో ఎరువులు, రసాయనాలు వాడకుండా కలుపును తీసుకోవాలని, దీంతో అనుకున్న దానికన్న అధిక దిగుబడి పొందవచ్చన్నారు. వర్షాలతో పంటలకు తెగుళ్ల సోకుతున్నాయని, వీటి నివారణ కోసం రైతులు సొంత నిర్ణయాలు తీసుకోకుండా ఏఈఓల సూచనలతో రసాయనాలను తమ పంటపొలాల్లో పిచికారీ చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఏఓ వినయ్, ఏఈఓ హరితతో పాటు రైతులు పాల్గొన్నారు.

### డీటీసీలో మొక్కలు నాటిన డీఐజీ

జడ్చర్ల: స్థానిక పోలీసు శిక్షణ కేంద్రంలో శుక్రవారం హరితహారం కార్యక్రమంలో భాగంగా జోగుళాంబ గద్వాల రేంజ్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ కె.నరసింహ మొక్కలు నాటారు. మొక్కల పెంపుదలకు ప్రతిఒక్కరు కృషి చేయాలని డీఐజీ పిలుపునిచ్చారు. డీటీసీ ఆవరణలో దాదాపు 540 మొక్కలు నాటినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, ఏఆర్ ఏఎస్పీలు సురేష్, కుమార్, డీఎస్పీలు మహేశ్, రమణారెడ్డి, శ్రీనివాసులు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



# అక్షర‘జ్ఞానం’



కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులు(ఫైల్)

- ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ‘లిప్’యాప్
- భాషా ప్రావీణ్యం పొందేలా బోధనోపకరణాలతో శిక్షణ
- సామర్థ్యాలు పెంపొందించడమే లక్ష్యం
- ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు

పెబ్బేరు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యం పెంపొందించేందుకు ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతేడాది ప్రాథమిక స్థాయిలో విద్యను బలోపేతం చేయడానికి ప్రారంభించిన ‘తొలిమెట్టు’ కార్యక్రమం విజయవంతం కావడంతో ఈ విద్యా సంవత్సరంలో ఉన్నత విద్యలో ‘లిప్’(లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈ సంవత్సరం నుంచి అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. అందుకు సంబంధించి హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం అనంతరం జిల్లాలోని ఉపాధ్యాయ నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహించి అమలు చేసేందుకు సన్నాహాలు చేపడుతున్నారు.

**జిల్లా నుంచి సబ్జెక్ట్‌కు ముగ్గురు..**

తొలిమెట్టు కార్యక్రమం తరహాలో ఉన్నత విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి విద్యాశాఖ చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఆస్కి)లోని సేవ్ ది చిల్డ్రన్స్ సహకారంతో జూలై 30 నుంచి 6వ తేదీ వరకు శిక్షణ పొందేందుకు సబ్జెక్టుకు ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా నుంచి వెళ్తున్నారు. శిక్షణ పూర్తితో జిల్లాలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

### ప్రయోగాత్మకంగా సర్వే..

6 నుంచి 9వ తరగతి విద్యార్థులపై ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించింది. ఇందులో అభ్యసన సామర్థ్యాల్లో విద్యార్థులు తడబడ్డారు. తరగతికి తగ్గట్టు విద్యాసామర్థ్యాలు నేర్చుకోవడం లేదని తెలిసింది. తెలుగు, ఆంగ్లంతో పాటు కూడికలు, తీసివేతలు కూడా చేయడం లేదని తేలింది. దీనిని అధిగమించేందుకు ‘లిప్’ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉన్నత స్థాయిలో అన్ని రకాల సామర్థ్యాలు పెంపొందించి పిల్లల ఎదుగుదలకు దోహదం కానుంది.

### ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు..



విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా ‘లిప్’ కార్యక్రమం ఈ ఏడాది నుంచే అమలు చేయనున్నాం. శిక్షణ అనంతరం అన్ని పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు సామర్థ్యాలు పెంపునకు అన్ని విధాలుగా ఉపయోగపడుతుంది.

– గోవిందరాజులు, ఇన్‌చార్జ్ డీఈఓ, వనపర్తి.

### తరగతికి తగినట్టుగా....

విద్యార్థుల వెనుకబాటు కారణాలు తెలుసుకుని వాటిని అధికమించేందుకు ‘లిప్’ కార్యక్రమం అమలు చేయనున్నారు. విద్యార్థుల తరగతి తగ్గ సామర్థ్యాలు పెంచడం, ధారళంగా మాట్లాడటం, చదవడం, రాయడం, వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. సబ్జెక్టుల వారీగా నైపుణ్యాలు పెంచడానికి దోహదం చేస్తుంది. గణితం, సామాన్య, సాంఘిశాస్త్రాలతో పాటు భాషా ప్రావీణ్యం పొందేలా బోధనోపకరణాలతో శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లాలో **58** ప్రాథమికోన్నత పాఠశాలలు

| ఉన్నత పాఠశాలలు | 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు |
|---|---|
| 97 | 28 వేలు |

### సబ్జెక్ట్‌లో పట్టు సాధించేలా

కోవిడ్ నేపథ్యంలో ప్రత్యక్ష తరగతులు లేక విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు తగ్గాయి. సాధారణ పరిస్థితులు ఏర్పడిన తర్వాత బోధనను గాడిలో పెట్టేందుకు విద్యాశాఖ పలు సంస్కరణ అమలు చేస్తోంది. ఉన్నత విద్యను పటిష్టం చేసేందుకు ‘లిప్’ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో ప్రత్యేక బోధన చేయాలని నిర్ణయించారు. తొలిమెట్టు కార్యక్రమం మాదిరిగానే ఈ కార్యక్రమంపై పూర్తి శ్రద్ధ తీసుకోనున్నారు. విద్యార్థుల అక్షర ప్రగతికి అనుగుణంగా వారికి సబ్జెక్ట్‌లో పట్టు సాధించేలా ప్రయత్నం చేయనున్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ట్రాన్స్‌ఫార్మర్, స్ట్రీట్ లైట్లను ప్రారంభించిన మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన, జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డితో కలిసి వనపర్తి మండలంలోని చిట్యాల మార్కెట్‌యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్, స్ట్రీట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, మార్కెట్ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్, గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడు కురుమూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**విజయనూనెల విక్రయ కేంద్రం ప్రారంభం**

వనపర్తి: ప్రస్తుత కాలంలో మనం తీసుకునే ఆహారం ఏదో ఒక రకంగా కల్తీగా మారుతోందని, దీన్ని అరికట్టి నాణ్యమైన వస్తువులు తయారు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలో ఆయిల్‌ఫెడ్ సంస్థ వారి విజయ వంటనూనెల విక్రయ కేంద్రాన్ని జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన వంట నూనె అందించాలనే ఉద్దేశంతో వంటనూనెల ఔట్‌లెట్ నిర్మాణానికి స్థలం కావాలని కోరగానే స్థలం కేటాయించామని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుంటే భవిష్యత్‌లో ప్రైవేటు సంస్థల అరాచకాలు లేకుండా చూడవచ్చని చెప్పారు. ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడారు. పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సైతం ఈ ఔట్‌లెట్‌తో ఉపయోగం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్, గట్టుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



గోపన్‌పేటలో పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిశంకర్

**జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిశంకర్**

మదనాపురం: విధులపై ఎవరు నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిశంకర్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని గోపన్‌పేట సబ్‌సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 11:30 గంటలు దాటుతున్నా.. అక్కడ పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు రాకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతలు లేకుండా పనిచేయవద్దని హెచ్చరించారు. ఇద్దరు సిబ్బంది విధులకు దుమ్మా కొట్టినందుకు షోకాజ్ నోటీసులు ఇస్తామన్నారు. తరువాత మూడు రోజుల్లో జిల్లా ఉన్నతాధికారులకు వివరణ ఇవ్వాలని చెప్పారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున, ప్రభుత్వం వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచిస్తే ఇక్కడ నిర్లక్ష్యం వహించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకుంటే సస్పెండ్ చేసి శాశ్వతంగా విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అక్కడే ఉన్న ఆశావర్కర్‌తో రికార్డులు పరిశీలించారు. అనంతరం సర్పంచ్ ఆంజనేయులు యాదవ్‌తో కలిసి గ్రామంలో పలు కాలనీలో తిరిగి గ్రామస్తులు పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీల పంచాయతీ కార్యదర్శి భరత్ తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేట నిషేధం

నారాయణపేట రూరల్: చేపల సంతానోత్పత్తి సమయాన్ని పురస్కరించుకుని జూలై, ఆగస్టు రెండు నెలలు నదులు, రిజర్వాయర్లలో చేపల వేటను నిషేదిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి రాణాప్రతాప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో చేపలు పట్టడం ఎంతో ప్రమాదకరమని, సాహసోపేతంగా వ్యవహరించి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని సూచించారు. ఆదేశాలను పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పైకం కోసమే పనులు

**మర్రికుంట మినీ ట్యాంక్ బండ్‌ను పరిశీలించిన చిన్నారెడ్డి**



మినీ ట్యాంక్ బండ్‌ను పరిశీలిస్తున్న చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: ప్రజల అభ్యున్నతి కోసం కాకుండా పైకం కోసమే నియోజకవర్గంలో పనులు కొనసాగుతున్నాయని మాజీ మంత్రి చిన్నారెడ్డి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మర్రికుంట చెరువు మినీ ట్యాంక్ బండ్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానికంగా కొనసాగుతున్న ప్రతి పనిలో ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి సొంత జేసీబీలు, పొక్లెన్లు, టిప్పర్లతో వేర్వేరు పేర్లతో మట్టిని తరలిస్తున్నాడని ఆరోపించారు. ఊరికి ఒక ట్యాంక్ బండ్ ఉంటుందని, ఇక్కడ దొరికిన ప్రతి చెరువుని ట్యాంక్‌బండ్ చేస్తున్నామనే పేరుతో గుట్టలను చదును చేసి మట్టిని తీసుకొచ్చి కట్టలపై వేసి అధిక బిల్లులు చేయించుకుంటున్నాడన్నారు. మర్రికుంటలో నాసిరకమైన పనులు చేస్తూ.. ప్రభుత్వ డబ్బును దుర్వినియోగం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కట్టపై నెర్రెలు ఏర్పడ్డాయన్నారు. మినీ ట్యాంక్ బండ్‌కు ఎంత ఖర్చు అయ్యింది? ఎంత బిల్లు పేమెంట్ చేశారో చూడాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతి అందజేస్తామని పేర్కొన్నారు.



సంగంబండ రిజర్వాయర్‌లో రెండెకరాల భూమి, ఇల్లు పోయింది. అక్కడున్నప్పుడు ఇద్దరు కొడుకులు, నేను వ్యవసాయం చేసుకుంటూ బతికాం. ఆర్ఆర్ సెంటర్‌కు వచ్చిన తర్వాత ఉపాధి లేకుండా పోయింది. కొడుకులిద్దరూ బతుకుదెరువుకు పట్నం పోయారు. ఇక్క డ నేను ఒక్క దాన్నే ఉంటున్నా. పనులు దొరక్క ఇబ్బంది అయితాంది.

– బొంబాయి అనంతమ్మ



రిజర్వాయర్ కింద అన్నీ పోయాయి. నా భర్త చనిపోగా.. భూమి నా పేరు మీద కాలేదు. కొత్త గార్లపల్లిలో 240 గజాల ప్లాట్ ఇచ్చారు. పరిహారమివ్వకపోవడంతో డబ్బులు లేక పునాది దశలోనే ఇంటి నిర్మాణం ఆగింది. రేషన్ కార్డు, వితంతు పింఛన్ ఇస్తలేరు.కూతుర్ని సర్కారు స్కూల్‌లో చదివిస్తూ.. కూలీ చేస్తూ బతుకుతున్నా.

– మాల లక్ష్మి



వైఎస్ హయాంలో నాకు రూ.200 పింఛన్ వచ్చేది. తెలంగాణలో సమగ్ర సర్వే అప్పుడు అధార్‌లో వయసు తప్పు పడిందని పింఛన్ కట్ చేశారు. వయసు 57 ఏళ్లకు కుదించిన తర్వాత మళ్లీ దరఖాస్తు పెట్టినా రాలేదు. మా కాడ కొత్తగా దరఖాస్తు చేసుకున్న ఎవరికీ పింఛన్ ఇవ్వడం లేదు. మక్తల్, ఊట్కూర్ పరిధి అని చెబుతూ అధికారులు తప్పించుకుంటున్నారు.

– మాల అంజప్ప



నాకు 65 ఏళ్లు. రేషన్ సరుకుల కోసం మొన్నటివరకు ఊట్కూరు మండలంలోని మా పాత గ్రామపంచాయతీ మల్లేపల్లికి ఆటోల్లో పోతుంటిమి. పోనురాను 36 కి.మీ.లు కాగా.. ఈ మధ్య సరుకులను అక్కడి నుంచి ట్రాక్టర్‌పై తీసుకొస్తున్నారు. ఇందుకు ఒక్కొక్కరి వద్ద రూ.50 తీసుకుంటున్నారు. ప్రభుత్వం మా బాధలు పట్టించుకుని రికార్డుల్లో మా గ్రామాన్ని మక్తల్‌కు మార్చి, రేషన్ షాప్ ఇక్కడే ఏర్పాటు చేయాలి.

– సాబేమ్మ

# గార్లపల్లిపై సంగంబండ



సంగంబండ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన పాత గార్లపల్లి (ఫైల్)

సంగంబండ రిజర్వాయర్ నిర్మాణంలో ఇళ్లు, భూములు కోల్పోయిన గార్లపల్లి ముంపు బాధితుల గోడు ఇది. పరిహారం అందక కొందరు, ఉపాధి కరువై మరికొందరు బాధ పడుతుండగా.. ప్రధానంగా అధికార యంత్రాంగం ముందుచూపు లేకుండా, గుడ్డిగా ఆర్ఆర్ సెంటర్‌కు తరలించి పనికానిచ్చేసిన తీరు వారిని మనోవేదనకు గురిచేస్తోంది. ఓటు హక్కు ఏమో మక్తల్ పురపాలికలో.. రేషన్, పింఛన్ వంటి ప్రభుత్వ పథకాలు, తదితర సర్టిఫికెట్ల కోసం ఊట్కూరు మండలానికి పరుగులు పెట్టాల్సిన దుస్థితి తెచ్చిపెట్టింది. ఇలా ఏడేళ్లుగా నిత్య నరకం అనుభవిస్తున్న పాత గార్లపల్లి, ప్రస్తుత కొత్త గార్లపల్లి వాసుల దీనగాథపై ‘సాక్షి’ ప్రత్యేక కథనం..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

- పునరావాసంలో పుట్టెడు సమస్యలు
- మక్తల్‌లో నివాసం, ఓటు హక్కు వినియోగం
- మల్లేపల్లి, ఊట్కూరులో రేషన్, పింఛన్, సర్టిఫికెట్లు, ఇతరత్రా సేవలు
- పోను, రాను 36 కి.మీలు.. వృద్ధులు, దివ్యాంగులకు తిప్పలు
- ఏడేళ్లుగా పట్టించుకోని అధికార యంత్రాంగం

గ్రౌండ్ రిపోర్ట్



ఆర్ఆర్ సెంటర్‌లోని కొత్త గార్లపల్లి వ్యూ

**240** మందికి పునరావాస ప్యాకేజీ సంగంబండ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ఊట్కూరు మండలం మల్లేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఆమ్లెట్ విలేజీ గార్లపల్లిని 2005లో ముంపు ప్రాంతంగా ప్రకటించారు. 2016లో గ్రామాన్ని ఖాళీ చేసి మక్తల్ శివారులోని పునరావాస కేంద్రానికి తరలించారు. పునరావాస ప్యాకేజీ కింద ప్రభుత్వం 175 సర్వేనంబర్‌లో 240 మంది బాధితులకు 25 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఇళ్ల నిర్మాణ వ్యయం కింద బిల్లులతో పాటు సాగుభూమి కోల్పోయిన వారికి పరిహారం అందజేసింది. పెళ్లి అయిన వారు 131 మందికి ఇంటి నిర్మాణం కోసం ఒక్కొక్కరికి రూ.2.40 లక్షలు..18 ఏళ్లు పైబడి పెళ్లి కాని వారు ఒక్కొక్కరికి రూ.1.80 లక్షల చొప్పున మంజూరయ్యాయి. మొత్తం 600 ఎకరాల సాగు భూమి ముంపునకు గురి కాగా.. గార్లపల్లి రైతులకు చెందిన 400 ఎకరాలు.. మాదారం నేరేడుగాం, సోమేశ్వర్ బండ గ్రామాల రైతులకు చెందిన 200 ఎకరాలకు నష్టపరిహారం మంజూరైంది. భూమిని బట్టి (తరి, ఖుష్కి) ఎకరాకు రూ.45 వేల నుంచి రూ.75 వేల చొప్పున పరిహారం అందజేశారు.


### 18 మందికి అందని పరిహారం..

బ్యాంక్ అకౌంట్ నంబర్లు, అడ్రస్‌లో తప్పులు, చనిపోయిన వ్యక్తి పేరు మీద భూములు, ఇల్లు ఉండి.. వారి కుటుంబ సభ్యులకు బదలాయింపు కాని వారికి సంబంధించి సుమారు 18 మందికి ఇప్పటివరకు పరిహారం అందలేదు. మొత్తం పరిహారంగా రూ.9.64 కోట్లు మంజూరు కాగా.. రూ.7.83 కోట్లు బాధితులకు అందాయి. రూ.1.81 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

### 18 కి.మీలు.. నిత్య నరకం

మక్తల్ శివారులో ఆర్ఆర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కొత్త గార్లపల్లిని మక్తల్ మున్సిపాలిటీ ఎనిమిదో వార్డులో కలిపారు. గార్లపల్లి వాసులకు మున్సిపాలిటీ పరిధిలో ఓటు హక్కు మాత్రమే కల్పించారు. ఏడేళ్లు అవుతున్నా ఈ గ్రామం ఊట్కూర్ మండలం, మల్లేపల్లి పంచాయతీ కిందే ఆన్‌లైన్‌లో వస్తోంది. రేషన్, పింఛన్ కోసం మల్లేపల్లికి.. కుల, నివాస, ఆదాయం, జనన, మరణ ధ్రువీకరణపత్రాలతో పాటు ఇతర సర్టిఫికెట్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల అమలు కోసం 18 కి.మీ.ల దూరంలోని ఊట్కూరుకే వెళ్లాల్సి వస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో ఉపాధి పనులకు అవకాశం లేకపోవడం.. స్థానికంగా పనులు దొరకని పరిస్థితుల్లో 25 కుటుంబాలు బతుకుదెరువు కోసం హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు తెలుస్తోంది. కొత్తగార్లపల్లిలో అంగన్‌వాడీ, కమ్యూనిటీ భవనం ఉన్నప్పటికీ.. టీచర్లు, ఆయాలు, వైద్య సిబ్బందిని భర్తీ చేయకపోవడంతో వృథాగా ఉన్నాయి.

### ముందుచూపు లేమి, నిర్లక్ష్యంతోనే సమస్యలు..






కొత్త గార్లపల్లి నుంచి మక్తల్ మున్సిపాలిటీకి 3 కిలోమీటర్లు. అధికారుల ముందుచూపు లేమి, నిర్లక్ష్యం వల్ల వివిధ సర్టిఫికెట్లకు 18 కి.మీల దూరంలోని ఊట్కూర్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఏదైనా సర్టిఫికెట్ అర్జెంట్‌గా కావాలంటే అధికారులు అక్కడ, ఇక్కడ అంటూ తప్పించుకుంటున్నారు. మా సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించాం . ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు.

– నాగేష్ (పాలిటెక్నిక్), కుర్వ మల్లేష్ (ఇంటర్), విద్యార్థులు

### మక్తల్ మున్సిపాలిటీకి మార్చాలి..



ఊట్కూరు మండలం నుంచి మక్తల్ మున్సిపాలిటీలోకి కొత్తగార్లపల్లిని మార్చేలా విభజన ప్రక్రియను చేపట్టి పూర్తి చేయాలి. ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నాం. కనీస చర్యలు లేవు. మండలంలో గానీ, జిల్లా పరిషత్‌లో గానీ తీర్మానం చేయలేదు. ప్రభుత్వానికి సిఫార్సు చేశారా అనేది కూడా తెలియడం లేదు. గ్రామస్తులందరూ ఇబ్బందులు పడుతున్నారు. మా సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు తప్పవు.

– ఈడిగి మల్లేష్ గౌడ్, పునరావాస కమిటీసభ్యుడు

## క్లుప్తంగా

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


ఈశ్వరయ్య (ఫైల్)

తెలకపల్లి: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జమిస్తాపూర్‌కు చెందిన దర్శమోని ఈశ్వరయ్య(48) గురువారం రాత్రి బీడు పొలాన్ని తడిపేందుకు మోటరు ఆన్ చేయడానికి వెళ్లాడు. స్టాటర్ వద్ద మరో వైరు తేలి ఉండడంతో గమనించక ఎడమ చేతికి వైర్ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి ఎంతసేపటికి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా అతని మృతదేహం కనిపించింది. అతని భార్య సుహాసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

### బైక్ ఢీకొని వ్యక్తి..


శ్రీశైలం (ఫైల్)

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో శుక్రవారం మోటర్ సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. అమిస్తాపూర్‌కు చెందిన కోట్ల శ్రీశైలం(55) ఇంటి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా భూత్పూర్ నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న మోటర్ సైకిల్ ఢీకొట్టింది. దీంతో అతని తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే గ్రామానికి చెందిన మశ్చేందర్ అతని కుమారులు శ్రీకాంత్, శ్రీధర్‌లకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి విషమించడంతో వైద్యులు హైదరాబాద్ గాంధీకి రెఫర్ చేశారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్రీశైలం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. అతని భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు బైక్‌తో ఢీకొట్టిన కప్పెటకు చెందిన పసుల మహేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### అపార్టుమెంట్ పైనుంచి దూకి మహిళ బలవన్మరణం


జయలక్ష్మి(ఫైల్)

గద్వాల క్రైం: అపార్టుమెంట్ పైఅంతస్తు నుంచి దూకి మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన గద్వాల జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. భీంనగర్ కాలనీలో నివాసముంటున్న జయలక్ష్మి(40) శుక్రవారం ఉదయం వ్యాయామానికి వెళ్తున్నట్లు భర్త సత్యరెడ్డికి చెప్పి ఇంటి నుంచి బయటకొచ్చింది. ఇంటి ఎదురుగా ఉన్న అపార్టుమెంట్ ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి వచ్చి మృతికి గల కారణాలు ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రి తరలించినట్లు ఎస్‌ఐ అబ్దుల్‌షకూర్ తెలిపారు. మృతికి కారణాలు సూసైడ్ నోట్‌లో రాసినట్లు తెలిసింది. సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### సెల్ఫీ వీడియో తీసుకుని యువతి ఆత్మహత్య

జడ్చర్ల: సెల్ఫీ వీడియో తీసుకుని ఆయా వీడియోలను తాను పనిచేస్తున్న సూపర్ మార్కెట్ స్టాఫ్ గ్రూప్‌లో పోస్టు చేసి ఇంట్లో ఉరి వేసుకుని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం జడ్చర్లలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక వీర శివాజీ నగర్‌లో నివాసం ఉంటున్న అరుణ(24) స్థానిక నేతాజీ చౌరస్తాలోని ఓ సూపర్ మార్కెట్‌లో పనిచేస్తుంది. ఇటీవల భర్త రాజుతో విభేదాలు రావడంతో విడిగా ఉంటున్నట్లు తెలిసింది. అయితే ఆత్మహత్యకు పాల్పడిన అరుణ సెల్ఫీ వీడియోతో పాటు వాట్సప్ చాటింగ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'దేవి లేకుండా నేను బతుకలేక పోతున్నా.. చచ్చిన ఆ పిల్ల కోసమే.. బతికినా ఆ పిల్ల కోసమే.. తాను చనిపోయాక ఆ పిల్ల నా శవం దగ్గరకు వచ్చి చూడాలి' అంటూ మెసేజ్ పోస్టు చేయడంతో పాటు వీడియోలా పేర్కొంది. దేవి ఐ మిస్ యూ, ఐ లవ్ యూ అంటూ పేర్కొంది. ఫ్రెండ్‌షిప్ కోసం ప్రాణం ఇస్తున్నానంటూ పేర్కొంది. తనను పోస్టుమార్టం చేయకుండా అంత్యక్రియలు నిర్వహించాలని పేర్కొంది. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కాగా ఆత్మహత్యకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఈ సందర్భంగా సీఐ రమేశ్‌బాబు తెలియజేశారు.

### మూర్ఛతో వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: మూర్ఛ రావడం వల్ల చెట్ల పొదల్లో కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ శివారులోని కోయిలకొండ రోడ్డు పక్కన శుక్రవారం చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్ రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఖలీల్ చౌక్‌కు చెందిన షేక్ జాఫర్(42) ఈనెల 23న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అతనికి మద్యం అలవాటుతో పాటు మూర్ఛ సమస్య ఉంది. అతను తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చాలాచోట్ల వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం మండల పరిధిలోని హనుమాన్ తండాకు చెందిన రాజునాయక్ కోయిలకొండ రోడ్ పక్కన చెట్లపొదల్లో మృతదేహం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. భార్య నజ్నీన్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ

- జూరాలకు1.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 23 గేట్లు ఎత్తి శ్రీశైలం ప్రాజెక్టుకు 1.24లక్షల క్యూసెక్కులు విడుదల
- 12 యూనిట్లలో కొనసాగుతున్న జల విద్యుదుత్పత్తి


దిగువ జూరాల పవర్‌హౌజ్ కేంద్రం వియ్యర్ వద్ద పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

గద్వాల రూరల్/దోమలపెంట/ఆత్మకూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్ర, కర్ణాటక పరిధిలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో కృష్ణమ్మ ఉరకలెత్తుతోంది. శుక్రవారం రాత్రి 9 గంటలకు జూరాలకు 1,90,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టులోని 23 గేట్లు ఎత్తి దిగువనున్న శ్రీశైలం జలాశయానికి 1,24,265 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 7.224టీఎంసీలు ఉంది. నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాల్వకు 390 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, కుడి ప్రధాన కాలువ, సమాంతర కాలువ, కోయిల్‌సాగర్, భీమా లిఫ్టు-2కి ఎలాంటి పంపింగ్ చేయలేదు. 12 యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతుండగా.. ఇందుకోసం 34,012 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అదేవిధంగా కర్ణాటకలోని ఆలమట్టి నుంచి నారాయణపూర్ ప్రాజెక్టుకు 1.75క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి దిగువనకు 1,57,500క్యూసెక్కుల నీటిని దిగువనకు విడుదల చేసినట్లు ఈఈ జుబేర్ తెలిపారు.

■ జూరాల జన్‌కో పరిధిలో ఎగువ కేంద్రంలోని ఆరు యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 22 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు.

■ శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాలు జూరాల, సుంకేసుల నుంచి వస్తున్న వరద గంటగంటకు పెరుగుతోంది. రాత్రి 9 గంటల సమయంలో స్పిల్‌వే ద్వారా 1,24,265 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 34,012, సుంకేసుల నుంచి 4,311, హంద్రీ నుంచి 117 క్యూసెక్కులు మొత్తం 1,62,705 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885.0 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 826.50 అడుగుల నీటిమట్టం, 46.1366 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

### రామన్‌పాడు నుంచి వెయ్యి క్యూసెక్కులు



మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయానికి వరద పోటెత్తింది. శుక్రవారం ఊకచెట్టు పెద్దవాగు, మదనాపురం ఊకచెట్టు చిన్నవాగు నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో అధికారులు రామన్‌పాడు ఒక గేటు ఎత్తి 1000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం 1,021.6 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాలువ ద్వారా 350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. రామన్‌పాడు కుడి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఎడమకాల ద్వారా 10 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. రెండో దశ బీమా ఎత్తిపోతల ఒకటో స్టేజి నుంచి 108 క్యూసెక్కుల నీటిని రెండో స్టేజికి తరలిస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రవీల్‌రెడ్డి తెలిపారు.

**సుంకేసుల నీటి విడుదల**

రాజోళి: సుంకేసుల జలాశయం నుంచి శుక్రవారం నీటిని విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు. డ్యాముకు ఎగువ నుంచి 4,311 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, ఒక గేటు తెరిచి అంతే నీటిని దిగువనున్న శ్రీశైలానికి వదిలినట్లు ఆయన తెలిపారు. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 1.2 టీఎంసీలు కాగా, ప్రస్తుతం డ్యాంలో 1.026 టీఎంసీలు ఉన్నట్లు ఆయన తెలిపారు.

**కోయిల్‌సాగర్ నీటిమట్టం 24.6 అడుగులు**


కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

దేవరకద్ర: మహబూబ్‌నగర్ జిల్లాలో ఏకైక భారీ నీటి పారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో మరో రెండు అడుగుల నీరు చేరితే పాత అలుగు స్థాయికి చేరుకుంటుంది. శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 24.6 అడుగులకు నీటి మట్టం చేరింది. పాత అలుగు స్థాయి 26.6 అడుగులు కాగా, కేవలం రెండు అడుగుల నీరు వస్తే అలుగు నుంచి నీరు జాలువారే అవకాశం ఉంది. ప్రాజెక్టు గేట్ల స్థాయి వరకు 32.6 అడుగులు కాగా మరో 8 అడుగులు నీరు వస్తే గేట్లను తెరిచే అవకాశం ఉంది. పెద్దవాగు నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోతోనే ప్రాజెక్టు నీటి మట్టం పెరుగుతోంది.

## ముగిసిన నవోదయ క్రీడలు


ఆయా జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు

బిజినేపల్లి: తెలంగాణ రాష్ట్రస్థాయి నవోదయ విద్యాలయాల క్రీడలు శుక్రవారం ముగిశాయి. ఈ క్రీడల్లో తెలంగాణ రాష్ట్రంలోని ఆయా జిల్లాలకు చెందిన నవోదయ విద్యాలయాల విద్యార్థులు 400 మంది పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, టెబుల్ టెన్నిస్, చెస్, యోగ, బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో పోటీలు నిర్వహించారు. ఆయా విభాగాల్లో వట్టెం నవోదయ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో నల్గొండ, మూడో స్థానంలో ఖమ్మం జిల్లా నవోదయ విద్యార్థులు నిలిచారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రత్యేక ఎంపిక బృందం సమక్షంలో ఉత్తమ క్రీడాకారులను రిజనల్ స్థాయికి ఎంపిక చేసినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు మెమోంటోలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## అర్ధరాత్రి గురుకులంలో యువకుడి హల్‌చల్


సల్కర్‌పేట్ గురుకుల పాఠశాల

గండేడ్: అర్ధరాత్రి గురుకుల పాఠశాలలో యువకుడు హల్‌చల్ చేసి విద్యార్థుల కాళ్లు పట్టిలాగడంతో భయాభ్రాంతులకు గురయ్యారు. రెండు రోజుల క్రితం ఈ ఘటన జరిగినా ఉపాధ్యాయులు బయటకు పొక్కనివ్వలేదు. శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని సల్కర్‌పేట్ ప్రభుత్వ గిరిజన బాలికల మినీ గురుకుల పాఠశాలలోకి బుధవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని యువకుడు ప్రవేశించాడు. విద్యార్థినులు మొదటి అంతస్తు రెండు డార్మెంట్లలో పడుకుంటారు. యువకుడు మెట్ల ద్వారా విద్యార్థినీలు నిద్రిస్తున్న గదుల్లోకి వెళ్లి కాళ్లు పట్టి లాగాడు. దీంతో విద్యార్థినీలు భయాభ్రాంతులకు గురై లేవడంతో వారిని బెదిరించాడు. రెండో డార్మెంట్‌లోకి వెళ్లి అక్కడ విద్యార్థినీ లు కాళ్లు లాగి వారిని బెదిరించడంతో అరవకుండా ఉండిపోయారు. 150 మంది విద్యార్థినీలున్న గురుకులంలో యువకుడు పదినిమిషాలు తిరుగాడినట్లు సీసీపుటేజీలో నిక్షిప్తమైంది. గురువారం ఉదయం ఈ విషయాన్ని పిల్లలు ఉపాధ్యాయులకు చెప్పారు. రెండు రోజులైన ఈ విషయాన్ని బయటికి రాకుండా ఆరోజు విధుల్లో ఉన్న ప్రిన్సిపాల్ పద్మ జాగ్రత్త పడ్డారు. ఈ విషయం తెలియడంతో శుక్రవారం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెంట్యానాయక్ గురుకులానికి వెళ్లి ఉపాధ్యాయులను నిలదీశాడు. ఘటన జరిగి రెండు రోజులైన పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపాడు. గతంలో పాపా కూడా గురుకులం నుంచి పారిపోయింది. అప్పుడు కూడా ప్రిన్సిపాల్ పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా రెండో రోజు కూడా యువకుడు వస్తాడేమోనని కారంపొడి, రాళ్లు దాడి చేయడానికి పెట్టుకున్నామన్నారు. అందుకే పోలీసులకు ఫిర్యాదు చేయలేదని ఆమె తెలిపారు.

## నత్తనడకన పైపులైన్ పునరుద్ధరణ పనులు


పనులను పరిశీలిస్తున్న వాటర్ గ్రిడ్ అధికారులు

అయిజ: పట్టణంలోని పెద్ద వాగుపై చేపట్టిన వాటర్ గ్రిడ్ పైప్‌లైన్ పునరుద్ధరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పైప్‌లైన్ కూలిపోయి వారం రోజులవుతున్నా ఇంకా పునరుద్ధరణ పనులు ప్రారంభదశలోనే ఉన్నాయి. కూలిన పైపులను ప్రొక్లెయిన్‌లతో పైకి ఎత్తేందుకు శుక్రవారం వాటర్‌గ్రిడ్ సిబ్బంది ఆపసోపాలు పడ్డారు. ఇంకా వాగులో పైప్‌లైన్ కింద పిల్లర్లు నిర్మించాల్సి ఉంది. వాగులో వర్షంనీరు నిల్వ ఉండడంతో పనులకు ఆటకం కలిగింది. నీటిని ఎంత తోడినా నీటి శాతం తగ్గకపోవడంతో వాటర్‌గ్రిడ్, ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ తలలు పట్టుకుంటున్నారు. వాటర్‌గ్రిడ్ ఎస్‌ఈ జగన్‌మోహన్, డీఈ నాగరాజు, ఏఈ రమేష్, ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రమోహన్ పనులను పరిశీలించారు. అలంపూర్ నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలు, 6 మండలాల ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ఆర్‌అండ్‌బీ, వాటర్ గ్రిడ్ అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు.

### మామను చంపిన అల్లుడికి పదేళ్ల జైలుశిక్ష

కోయిల్‌కొండ: రెండేళ్ల కిందట మామను చంపిన అల్లుడికి శుక్రవారం మహబూబ్‌నగర్ కోర్టులో 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. 2021 సంవత్సరం, అగస్టు 29న దేవరకద్ర మండలం నాగారానికి చెందిన కుమార్, మండలంలోని రాంపూర్‌కి చెందిన తన అత్తామామలతో గొడవ పడ్డాడు. వారిని కట్టెలతో కొట్టగా.. చికిత్స పొందుతూ మామ బుడ్డప్ప(65) మరుసటి రోజు ఆస్పత్రిలో మృతిచెందాడు. దీంతో మృతుడు బుడ్డప్ప కుమారుడు ఆంజనేయులు పోలీస్‌సేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా మహబూబ్‌నగర్ సెషన్స్ కోర్టులో న్యాయస్థానం నేరస్తుడికి శిక్ష ఖరారు చేశారు.

### నల్లమలలో అడవి దున్న సందడి



మన్ననూర్: కర్ణాటక అడవుల నుంచి నల్లమలకు వచ్చినట్లు భావిస్తున్న అడవి దున్న అటవీ పరిసర ప్రాంతంలో పర్యాటకులు, ప్రయాణికులకు కనిపిస్తూ సందడి చేస్తోంది. మూడు నెలల క్రితం నల్లమలలోకి ప్రవేశించిన అడవి దున్నకు జత లేనందుకేమో శ్రీశైలం – హైదరాబాద్ ప్రధాన రహదారిపై అటు, ఇటు దాటుతూ కనిపిస్తోంది. శుక్రవారం గుండం పరిసర ప్రాంతంలో రోడ్డు దాటుతూ యాత్రికులకు కనిపించింది. సమీప గ్రామాల పశువులు మేతకు అడవిలోకి వచ్చినప్పుడు వాటి వద్దకు దున్న వస్తున్నట్లు కాపరులు పేర్కొంటున్నారు. అడవి దున్న సంతతి పెంచేందుకు నల్లమలలో అడవి గేదెలను తెచ్చేందుకు అటవీశాఖ ఉన్నతాధికారులు సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

### డీజిల్ చోరీకి యత్నం


నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ డిపో ఎదుట నిలిపి ఉన్న ప్రైవేట్ బస్సు నుంచి గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్ చోరీకి యత్నించిన ఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బాల్‌రెడ్డి తన ప్రైవేట్ ఆర్టీసీ బస్సును డిపో ముందు ఉంచారు. గుర్తు తెలియని వ్యక్తులు బస్సు నుంచి డీజిల్ తీస్తుండగా అటువైపు నుంచి వచ్చిన స్థానికులు గమనించి వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. దుండగులు వెంటనే కారులో పరారయ్యారు. వెంటనే 100కు డయల్ చేయడంతో పోలీసులు వచ్చి పరిశీలించారు. ఘటనకు సంబంధించి బాధితుడు బాల్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

పెబ్బేరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన వనపర్తి మండలంలోని అంకూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వనపర్తికి చెందిన జితేందర్ పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీగా పని కోసం ఘణపురం మండలం సోలిపూర్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మరోవ్యక్తితో బైక్‌పై వనపర్తికి బయలుదేరాడు. రేవల్లి మండలం తల్పునూర్‌కు చెందిన కృష్ణయ్య, బావ, పాపతో బైక్‌పై వస్తుండగా అంకూర్ వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. కురుమూర్తి, చెన్నయ్య, జితేందర్‌తో పాటు చిన్నారి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు ఫోన్ చేశారు. వారిని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వనపర్తి రూరల్ ఎస్‌ఐ నాగన్న తెలిపారు.

# తెలంగాణ రాబిన్‌హుడ్.. పండుగ సాయన్న

- ఫుల్‌స్టాప్ తప్పు ఆర్డర్‌తో సాయన్నకు మరణ దండన
- సాయన్న స్వగ్రామం మెరుగోనిపల్లి
- నేడు పండుగ సాయన్న జయంతి


పండుగ సాయన్న ఊహా చిత్రం

నవాబుపేట: పేదల పాలిట ఆపద్బాంధవుడిగా, ఆకలికి అలమటించే నిరుపేదల ఆకలి తీర్చే సాయన్న ఇక్కడి ప్రాంత ప్రజల ఇష్టమైన నాయకుడు. తెలంగాణ ప్రాంతంలో కనుమరుగైన వీరుడి చరిత్ర ఉందంటే అది పండుగ సాయన్నదే. ఈయన కేవలం ధనవంతులపై, భూస్వాములపై దాడులు చేసే వ్యక్తిగానే సమాజానికి పరిచయం చేసిన పెత్తందార్లు, ఆయన నిజాం పాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలను, చరిత్రను కనుమరుగు చేశారు. అసలు సాయన్న తిరుగుబాటుకు కారణాలు, పరిస్థితులు మాత్రం ఎవరూ వివరించలేదు. మొహర్రం రోజు నాడే పండుగ సాయన్న జయంతిని చేయడం ఆనవాయితీగా వస్తుంది.

**మెరుగోనిపల్లి జన్మస్థలం**

మండలంలోని కేశవరావుపల్లి పరిధిలో ఉన్న కిలాట్‌నగర్ (మెరుగోనిపల్లి) గ్రామం ఈయన జన్మ స్థలం. తల్లి సాయమ్మ, తండ్రి అనంతయ్య. దాదాపుగా 1858 నుంచి 1860 మధ్యలో జన్మించినట్లు చరిత్ర ఆధారాలు ఉన్నాయి. ఆయనపై భూస్వాములు పెట్టిన కేసులు, జైలు శిక్ష పడిన విషయాలను బట్టి ఆయన జన్మించిన సంవత్సరాలు అంచనా వేశారు. 1860లో రజాకార్ల రాజ్యం కొనసాగుతుండేది. అప్పట్లో రజాకార్లు, భూస్వాములను చెప్పుచేతుల్లో పెట్టుకుని పాలన చేస్తుండే వారు. ఈ తరుణంలో భూస్వాములు పండుగ సాయన్న కుటుంబం భూమిని ఆక్రమించుకున్నారు. ఈ విషయంలో తిరగబడ్డ కుటుంబాన్ని వేధించారు. మొదటి సారి సాయన్న భూస్వాములను పొలంలో నాగళ్లు కట్టిన సమయంలో వారిని ఎదురించాడు. సాయన్నను ఏమైనా చేస్తారని కుటుంబ సభ్యులు అతన్ని చౌదూర్ సమీపంలోని మేక గుండు చెంత దాచి పెట్టారు. భూస్వాములు దాడులు చేసి కుటుంబాన్ని మరింత భయానికి గురిచేయాలని సాయన్న చిన్నమ్మపై లైంగిక దాడి చేశారు. అజ్ఞానంతంలో ఉన్న సాయన్న భూస్వాములపై దాడికి పథకాలు చేస్తూ తరుచు దాడులు చేయటం మొదలు పెట్టాడు. దీంతో కొందరు అనుచరులను సైతం సమీకరించుకుని దాడులకు దిగేవాడు. పలుమార్లు నిజాం పోలీసుల బలగాలతో సాయన్న కోసం వేట సాగించారు. సాయన్న నిజాం పోలీసులను అడవులు వెంట తిప్పి వారిని తరిమిసేవాడు.

**పండుగ సాయన్న పేరు ఎలా వచ్చిందంటే..**

సాయన్న నిజాంలకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న తరుణంలో చాలా గ్రామాలు ఆకలితో అలమటించేవి. ఇవి చూసి చలించిన సాయన్న గ్రామాలకు తిండి పెట్టాలని ఆలోచించి ఊర్లకు ఊర్లను ఒక చోట చేర్చి వారికి కావాల్సిన ఆహార ధాన్యాలు దోపిడి చేసి తీసుకుని వచ్చి వారికి ఇచ్చేవాడు. అలాగే మండల సమీపంలోని మైసమ్మ అడవి ప్రాంతంలో సాయన్న పండుగ చేసి చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు భోజనం పెట్టి ఆకలి తీర్చేవాడు. అప్పట్లో ఆకలి తీరాలంటే సాయన్న ఎక్కడో ఒక చోట దారిదోపిడి చేసి వంటలు వండించి పండుగలు, కందుర్లు చేసేవాడు. అప్పట్లో ప్రజలకు ఇష్టమైన దసర, పీర్లపండగ కలిసి వచ్చిన ఏడాది జన్మించటంతో అతన్ని పండుగ సాయన్నగా ప్రజలు పిలుచుకోవటం మొదలు పెట్టారు. అప్పటి వరకు సాయన్న తెలుగు సాయన్నగా సుపరిచితుడు.


జిల్లా కేంద్రంలో టీటీగుట్ట ప్రాంతంలో సాయన్న సమాధి

**దేశద్రోహం కేసులో జైలుకు..**

సాయన్నను అరెస్టు చేయాలని కొందరు భూస్వాములు పథకం పన్ని రాజ్యద్రోహం కేసులో జైలుకు పంపించారు. సాయన్న అరెస్ట్‌తో ప్రజల తిరుగుబాటుతో రజాకార్లు సైతం ఉలిక్కిపడ్డారు. దీంతో సాయన్నకు ప్రజల మద్దతు పెరగడంతో పాలమూరుకు చెందిన కొందరు ప్రముఖులు సాయన్నను జైలు నుండి విడిపించాలని ప్రయత్నం మొదలు పెట్టారు. దానికి నిరాకరించిన నిజాం పాలకులు సాయన్నను జైలులో చంపాలని ప్రయత్నిస్తున్నట్లు ప్రజలకు తెలియడంతో జైలుపై తిరుబాటు చేశారు. సాయన్న కనిపించకపోవటంతో పాలమూరు వీధుల్లో రజాకార్ల పోలీసులపై తిరగబడి తరిమికొట్టారు. ఇదిలా ఉంటే వనపర్తి రాణి శంకరమ్మను పాలమూరు ప్రముఖులు కలిసి సాయన్నను విడిపించాలని కోరారు. ఆమె నిజాం పాలకులకు లేఖరాసి వారిని స్వయంగా కలిసి వినతి అందించారు. అప్పటి ఎస్పీ జలాల్‌ఖాన్‌మోహితి మినాబ్‌కు రూ.10వేల జమానత్‌ను కట్టి విడిపించుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. నిజాం పాలకులు ఇచ్చిన ఆర్డర్‌లో 'మార్ మత్. చోడో' అనే ఆర్డర్‌ను ఎస్పీతో పాటు కొందరు కుట్రపన్ని 'మార్. మత్ చోడో అంటూ' మార్ పక్కన ఫుల్‌స్టాప్ పెట్టి ఆర్డర్‌ను చూపిస్తారు. దీంతో పోలీసులు జైల్లో సాయన్నను చంపేశారు. సాయన్న మరణ వార్తతో పాలమూరు మొత్తం అట్టుడికి పోయింది. ప్రజలు జైలుపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. ప్రజల తిరుగుబాటు చూసి భయాందోళనలో ఎస్పీ గుండెపోటుతో మరణించాడు. సాయన్నను అరెస్టు చేయించిన భూస్వాముల కోసం గాలించగా వారు అతిథిగృహంలో విందు చేసుకుంటున్నట్లు తెలియటంతో దానిపై దాడి చేసి దగ్ధం చేశారు. సాయన్నను జిల్లా కేంద్రంలోని టీటీగుట్ట ప్రాంతంలో సమాధి చేశారు. కాగా సాయన్న 1900లో జైలులో మరణదండనకు గురైనట్లు చరిత్ర చెబుతుండగా, ఆయన దాదాపుగా 1858 నుంచి 1900 వరకు జీవించాడు.

## త్వరలో బీచుపల్లి ఆయిల్‌మిల్లు పునరుద్ధరణ


మాట్లాడుతున్న చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి విజయ వర్ధిని ఆయిల్ మిల్లును త్వరలో పునరుద్ధరిస్తామని ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి ఆయిల్ మిల్లులో జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎండీ సురేందర్ హాజరై మాట్లాడారు. గద్వాల, నారాయణపేట జిల్లాల్లో మూడేళ్లలో 10వేల ఎకరాలు రైతులు పామ్ ఆయిల్ మొక్కలు నాటినట్లు తెలిపారు. బీచుపల్లిలో పామాయిల్ మిల్లును పునరుద్ధరించడానికి భవనాలున్నాయని, మిషనరి యంత్రాలు మాత్రమే ఎరక్షన్ చేస్తారన్నారు. గంటకు 30 టన్నుల సామర్థ్యం ఉన్న మిషనరి నిర్మిస్తామన్నారు. దీనికోసం రూ.100కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసినట్లు తెలిపారు. వచ్చే నెలలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డితో పామాయిల్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు శిలాఫలకం వేస్తామన్నారు. పనులు ప్రారంభమైతే ఏడాదిన్నర లోపు రైతులకు ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తుందన్నారు. బీచుపల్లి, మల్దకల్ కలెక్షన్ సెంటర్ల ద్వారా త్వరలో పామాయిల్ గెలలను సేకరించనున్నట్లు ఆయన తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే పామాయిల్ తోటలను సాగు చేయాలని ఆయా జిల్లాల రైతులకు సూచించారు.